క్లుప్తంగా

కార్యకర్తలకు పోస్టల్ ప్రమాద బీమా



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ పార్టీ మండల కార్యకర్తలకు పోస్టల్ ప్రమాద బీమాను బీజేపీ పార్టీ కార్యకర్త శశాంక్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త కుటుంబానికి ఆసరా ఉండాలన్న ఉద్దేశ్యంతో తన సొంత ఖర్చుతో రూ.53 వేలతో 53 మంది కార్యకర్తలకు ప్రమాద బీమా చేయించాన్నారు. రిస్క్ జరిగితే రూ.15 లక్షలు వచ్చే విధంగా బీమా చేయించానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, మండల ఇన్‌చార్జి దొరబాబు, నాయకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వం అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీతో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకోవడంతో కంపెనీ ప్రతినిధులు మోహన్, బ్రహ్మనందరెడ్డి జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌బాబు, లెక్చరర్లు సంతోష్, హన్మండ్లు పాల్గొన్నారు.

పాఠశాలలో స్టేజీ కట్టించిన పూర్వ విద్యార్థి



బాన్సువాడ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి శ్రీనివాస్ అంబేకర్ రూ.50 వేల వ్యయంతో స్టేజీని కట్టించారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

బీబీపేట: మండల కేంద్రంలోని వాణి విద్యాలయం హైస్కూల్‌లో బుధవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, పాటలు, సాంస్కతిక కార్యక్రమాలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామ్ రాజ్‌గౌడ్, నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా



రాజంపేట : మండలంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం కల్యాణ మండపంలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట విధంగా తన సొంత నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు సంపత్‌రెడ్డి, రెడ్డి సంఘ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు లైన్‌క్లియర్ యాప్



ఎల్లారెడ్డి: విద్యుత్ ప్రమాదాల నివారణకు ట్రాన్స్‌కో సీఎండీ లైన్‌క్లియర్ యాప్‌ను రూపొందించారని డీఈ విజయసారథి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు లైన్ క్లియర్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతు విద్యుత్ సమస్య పరిష్కారం కోసం గతంలో విద్యుత్ సిబ్బంది సబ్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి సమస్యను పరిష్కరించేవారని సమాచార లోపం వలన ప్రమాదాలు జరిగేవన్నారు.విద్యుత్ సిబ్బంది ముందుగా యాప్‌లో ఏఈకి విద్యుత్‌సమస్య పరిష్కారానికి మెసేజ్ పెట్టాలన్నారు. ఏఈ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.కార్యక్రమంలో ట్రయినింగ్ డీఈ ప్రభాకర్, ఏఈ వెంకటస్వామి, మల్లేష్, ప్రసాద్‌రెడ్డి, గంగాధర్ తదితరులున్నారు.

రోడ్లపైనే వడ్ల ఆరబోత

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పొంచి ఉన్న ప్రమాదం



అంకోల్ క్యాంపులో ఆరబోసిన ధాన్యం



అంకోల్-సంగం రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో వరికోతలు మొదలయ్యాయి. వడ్లు ఆరబోయడానికి సరియైన ప్రదేశాలు లేకపోవడంతో ప్రధాన రహదారులపై రైతులు ఆరబోస్తున్నారు. అంకోల్ క్యాంపులో జాతీయ రహదారి నిర్మాణం 50 మీటర్ల మేర పూర్తయిన చోట, మిర్జాపూర్ తండాలో గుంతల రోడ్డుపై ధాన్యాన్ని ఆరోబోస్తున్నారు. రోడ్డుకిరువైపులా ధాన్యాన్ని ఆరబోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కుప్పలను రోడ్డుపై చేయడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. గతంలో ప్రమాదం జరిగిన ఘటనలు ఉన్నాయి. ఈవిషయమై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలున్నాయి.

గతంలో జరిగిన ప్రమాదాలు

- నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండా గ్రామానికి చెందిన ఓ కుటుంబం రాత్రి వేళ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో వాహనం ధాన్యం కుప్ప ఎక్కడంతో వాహనదారుడిని కాలు విరిగింది.
- అంకోల్ తండా వద్ద సంగం గ్రామానికి చెందిన యువకుల ద్విచక్రవాహనం వడ్ల కుప్పను ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.
- నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్ పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ధాన్యం కుప్పను ఢీకొని తల పగిలి మృతి చెందాడు.
- తిమ్మాపూర్ వద్ద ద్విచక్ర వాహనం ధాన్యం కుప్ప ఎక్కడంతో బీహార్ కూలీ మరణించాడు.

అవగాహన కల్పిస్తాం



వరి కోతలు ప్రారంభమవడంతో రైతులు రోడ్డుపై ఇష్టారీతిన వడ్లను ఆరబెడుతున్నారు. రైతులు రోడ్డుకు ఒక వైపున ఆరబెట్టుకునేలా అవగాహన కల్పిస్తాం. వడ్ల కుప్పలపై నల్లటి తాటిపత్రులు కాకుండా తెలుపు తాటిపత్రులు వేయాలి. కుప్పల వద్ద రాళ్లను, ఇటుకలను పెట్టకూడదు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి.

– లావణ్య, ఎస్సై, నస్రుల్లాబాద్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట : ఎల్లారెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కంది శివరాములు



హన్మాజీపేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్



లింగంపేట: అయ్యపల్లిలో..

లింగంపేట/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/రాజంపేట/భిక్కనూరు/నిజాంసాగర్/బాన్సువాడ రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బుధవారం పలు సొసైటీల చైర్మన్లు అన్నారు. నాగిరెడ్డి మండలం మాల్తుమ్మెద, గోలిలింగాల, లింగంపల్లికలాన్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ నర్సింలు ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం మీసాన్‌పల్లి, బిక్కనూర్, శివానగర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ నర్సింలు ప్రారంభించారు.రాజంపేట మండలం కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, ఎసిద్దాపూర్, సంతాయిపేట గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఆర్గొండ సింగిల్ విండో చైర్మన్ కందిశివరాములు ప్రారంభించారు.భిక్కనూరు మండలం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో బషీరుద్దీన్, ఏపీఎం పద్మ, గ్రామ సమాఖ్య మహిళలతో కలిసి ప్రారంభించారు. బాన్సువాడ మండలం బుడిమి, కొత్తాబాది గ్రామాల్లో బాన్సువాడ ఏఎంసీ చైర్‌పర్సన్ అంజవ్వ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. లింగంపేట మండలం అయ్యపల్లి, పర్మళ్ల, శెట్పల్లి సంగారెడ్డి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు.ఈకార్యక్రమంలో సొసైటీ సీఈవోలు, ఏపీఎంలు, నాయకులు మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



నాగిరెడ్డిపేట/కామారెడ్డి రూరల్ : నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంటతండాలో, కామారెడ్డి మండలం గర్గుల్‌లో బుధవారం కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదంతో ర్యాలీ చేపట్టారు. దీంతో పాటు అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగంపై వారు ప్రతిజ్ఞ చేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాజమణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



బిచ్కుంద/నిజాంసాగర్ (జుక్కల్) : బిచ్కుంద మండలం ఖద్‌గాంలో బుధవారం రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్ ప్రారంభించారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మహమ్మద్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చెత్తబుట్టల పంపిణీ



దోమకొండ: తెలంగాణ యునివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని వాణిజ్య సముదాయాల దుకాణాదారులకు 200 చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ వేసవికాల ప్రత్యేక శిబిరంలో భాగంగా దోమకొండ పోర్టు ట్రస్టు సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అంజయ్య, హరిత,వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్, నేతలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆలే నరేంద్రకు ఘన నివాళి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆలే నరేంద్ర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ మాట్లాడారు. కేంద్ర మంత్రిగా లింగంపేట మండలంలో రోడ్లు వేయించిన గొప్ప వ్యక్తి నరేంద్ర అన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మండలం అభివృద్ధిలో దూసుకెళ్తుందని రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫియోద్దీన్ వెల్లడించారు. బుధవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు దక్కిందన్నారు.కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అఫ్రోజ్, పార్టీ మాజీ అధ్యక్షుడు ఎల్లమయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



బీబీపేట: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, శోభ పాల్గొన్నారు.

డీటీవోను కలిసిన ఆర్టీసీ డీఎం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కరుణశ్రీ బుధవారం జిల్లా రవాణశాఖ అధికారి(డీటీవో) శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నానని ఎమ్మెల్యే తెలిపారు.

రేషన్‌కార్డులో తప్పిదాలను సవరించాలి

కామారెడ్డి టౌన్: ఆహారభద్రత కార్డులో కుటుంబ సభ్యుల పేర్ల మార్పు, చేర్పుల సవరణలో జరిగిన తప్పిదాలను తక్షణమే సవరించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మీసేవా కేంద్రాలలో కుటుంబ సభ్యుల పేర్ల చేరికలు, మార్పులతో దరఖాస్తు చేసుకుంటే కొందరి కార్డులో అంతా గందరగోళంగా పేర్లు నమోదు అయ్యాయని తెలిపారు.తక్షణమే అధికారులు స్పందించాలని కోరారు.

ఉపాధికూలికి గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామశివారులో ఉపాధిపనికి వెళ్లిన కర్రోల్ల కవిత అనే మహిళా కూలికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామశివారులోని ఓ రైతు పొలంలో ఫాంపండ్ తవ్వే క్రమంలో కవిత అనే కూలి అదుపుతప్పి కిందపడింది. దీంతో ఆమె ముఖానికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఫీల్డ్‌అసిస్టెంట్ స్వప్న గాయపడిన కవితను నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు.

భిక్కనూరు మహిళా సమాఖ్యలో ఆడిట్

భిక్కనూరు: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో బుధవారం సెర్ప్ అధికారులు ఆడిట్ నిర్వహించారు.మండల మహిళా సమాఖ్య భవనంలో అన్ని రికార్డులను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్ సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండలం హాజీపూర్ తండాలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం మురుగు కాలువలను శుభ్రం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంపులో భాగంగా గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేసి గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ చంద్రకాంత్ తదితరులున్నారు.

నర్సరీలో మొక్కల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్‌లో నర్సరీని ఎంపీవో ప్రకాష్ పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. పారిశుధ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎండ వేడిని తాళలేక..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండుటెండలో ఎండ వేడిని భరించలేక స్కూల్ నుంచి ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట హైస్కూల్‌లో చదివే ధర్మారెడ్డి గ్రామానికి చెందిన విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం పాఠశాల సమయం ముగిసిన తర్వాత బస్సులో తాండూర్ గేట్ వరకు చేరుకొని అక్కడి నుండి సుమారు కిలోమీటర్ దూరం వరకు నడుచుకుంటూ వారి గ్రామానికి వెళ్లారు. నడుచుకుంటూ వెళ్లే క్రమంలో ఎండబారి నుంచి ఉపశమనం పొందేందుకు ఒక చున్నిని నలుగురు విద్యార్థులు తలపై కప్పుకొని వెళ్తున్న దృశ్యం 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

రసవత్తరంగా కుస్తీపోటీలు



సింగితం గ్రామంలో మల్లయోధునికి నగదును అందజేస్తున్న నాయకులు



హన్మాజీపేట్‌లో...



మల్లయోధురాలిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్/బాన్సువాడ రూరల్ : జిల్లాలో బుధవారం పలు చోట్ల నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. మహమ్మద్ నగర్ మండలం సింగితం గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా, శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ దేవతల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా జాతర మహోత్సవం నిర్వహించారు. కుస్తీలో గెలిచిన వారికి 5తులాల రెండు వెండి కడియాలు, రూ.3వేల నగదును గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బహూకరించారు.

ప్రత్యేక ఆకర్షణగా మహిళా మల్లయోధులు

జుక్కల్ మండల కేంద్రంలోని మహదేవ్ మందిరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీల్లో కర్ణాటక రాష్ట్రం పుల్యాల్ తండాకు చెందిన కల్పన చౌహన్, శోభ చౌహన్ అనే మహిళా మల్లయోధులు పాల్గొన్నారు. మహిళా మల్లయోధులను జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అభినందించారు.

మత్స్య శాఖ ఫెడరేషన్ చైర్మన్‌ను కలిసిన సంఘం సభ్యులు



బాన్సువాడ : మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను బుధవారం హైదరాబాద్‌లో జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గాదం సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మత్స్యకారుల సంక్షేమంపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మత్స్యశాఖ సంఘం డైరెక్టర్లు అశోక్, రవి, చిన్న రాములు, సలహాదారులు గాదం బాలయ్య, సభ్యులు మహేష్, బాలకృష్ణ తదితరులున్నారు.

బస్టాండ్‌ను సందర్శించిన డీఎం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను కామారెడ్డి డిపో మేనేజర్ కరుణశ్రీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బస్టాండ్‌లో ప్రయాణికులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రం కావడంతో బస్టాండ్‌లో తాగునీరు ఏర్పాటు చేయాలని, అలాగే మరుగుదొడ్లు, మూత్రశాలలు బాగుచేయించాలని డీఎం దృష్టికి తెచ్చారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మికం

గరుడవాహనంపై శ్రీ సీతారామచంద్రస్వామి



రామారెడ్డి: శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో స్వాగతం పలికారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ఎల్లారెడ్డి : పట్టణంలోని శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు ఉన్నారు.

ఐరావతంపై సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను రామాలయం నుంచి రాజరాజేశ్వరాలయం వరకు ఊరేగించారు. భక్తులు స్వామి వారి విగ్రహాలకు హారతులిచ్చి పూజలు నిర్వహించారు.

బీబీపేటలో చౌడాలమ్మ దేవి విగ్రహాల..



బీబీపేట: మండల కేంద్రంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చౌడాలమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా ఆలయ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా అమ్మవారి విగ్రహాలను ఊరేగించారు. యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చన

కామారెడ్డి అర్బన్: శ్రీఆది శంకరాచార్య భగవాన్ నామ సంకీర్తన మండలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో 250 మంది ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

రాం మందిరం నిర్మాణానికి విరాళం



కామారెడ్డి క్రైం: సదాశివనగర్‌లో శ్రీ రాం మందిరం నిర్మాణం కోసం మాజీ ఎంపీటీసీ పాపనోల్ల బీరయ్య దంపతులు రూ.1,11,111 విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బాల్‌రెడ్డి, పెసరి సాయిలు, కుమ్మరి రాజయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దైవకార్యంలో యువత ముందుండాలి



నిజాంసాగర్(జుక్కల్): దైవకార్యాల్లో యువత ముందుండాలని మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. బుధవారం మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామ బాపన్‌పల్లి హనుమాన్ ఆలయంలో శివపంచాయతన, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, శివ పార్వతుల కల్యాణానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నవగ్రహ,శివపంచాయతన విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారంతో ముగిశాయని వేదపండితుడు సంజీవ్‌రావ్ శర్మ తెలిపారు.

పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి



భిక్కనూరు: వనదుర్గ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కంచర్ల గ్రామంలో జరిగిన పెద్దమ్మ ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను గ్రామ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు శాలువాలతో సత్కరించి అభినందించారు.